క్లుప్తంగా

ఎన్ఎంసీ రాక కోసం సన్నద్ధం

ఆదిలాబాద్‌టౌన్: నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) ఈ నెలలో రిమ్స్‌లో తనిఖీలు నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో రిమ్స్ అధికారులు సిద్ధమవుతున్నారు. గురువారం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ రిమ్స్‌లోని ఆయా విభాగాల హెచ్‌వోడీలు, హెడ్ నర్సులు, ఇతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం రిమ్స్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీట్లు వంద ఉండగా 150 సీట్ల పెంపు కోసం ఇటీవల ఎన్ఎంసీకి దరఖాస్తు చేశారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించడం, వైద్య సేవలు అందించడం, తదితర విషయాలపై చర్చించారు.

7న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని మోడల్ స్కూళ్లలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈనెల 7న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరో తరగతిలో ప్రవేశం కోసం 1,416 మంది దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జైనథ్, నార్నూర్, గుడిహత్నూర్, ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడ, బజార్‌హత్నూర్, బోథ్ మోడల్ స్కూళ్లతో పాటు ఆదిలాబాద్ పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలల్లో ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 7 నుంచి పదో తరగతిలో ప్రవేశం కోసం 1,064 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నట్లు వివరించారు. వీరికి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈవో తెలిపారు.

నేడు సమావేశం

నేరడిగొండ: బోథ్ మండలంలోని సొనాల రామాలయ కమిటీ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, ప్రధాన కార్యదర్శులు జీవీ రమణ, రామగిరి శ్రీనివాస్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17న రామాలయంలో జరిగే సీతారాముల కల్యాణ మహోత్సవం విధివిధానాలపై సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రభుత్వ ఉద్యోగులు, యువజన సంఘాల సభ్యులు, వివిధ సంఘాల పెద్దలు సకాలంలో హాజరు కావాలని కోరారు.

జవాన్‌కు ఘన స్వాగతం

ఇచ్చోడ: మండలంలోని నర్సాపూర్ గ్రా మానికి చెందిన ఆర్మీ జవాన్ బాలాజీ ముండే ఈనెల 31న ఉద్యోగ విరమణ పొందారు. ఉద్యోగ విరమణ పొంది సొంత గ్రామానికి వచ్చిన సందర్భంగా గ్రామస్తులు ఇచ్చోడ మండల కేంద్రంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఓపెన్ టాప్ వాహనంలో ఆదిలాబాద్ బైపాస్ నుంచి సిరిచెల్మ చౌరస్తా వరకు ర్యాలీ వచ్చారు. మండల కేంద్రంలో శివాజీ, అంబేద్కర్, కుమరం భీం విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జవాన్ కు టుంబసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలీసు బలగాలతో ఫ్లాగ్‌మార్చ్


ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఇంద్రవెల్లి: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మండలంలోని మారుమూల గ్రామమైన పిట్టబొంగరంలో కేంద్ర బలగాలతో ఎస్సై దుబ్బాక సునీల్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా నిర్భయంగా ఓటుహక్కు వినియోగించాలని సూచించారు. ఎలాంటి సమస్య ఉన్న వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ప్రాజెక్టులో పాల్గొనడం అభినందనీయం

ఉట్నూర్‌రూరల్: నిత్య జీవితంలో గణితం ఉపయోగాలు అనే అంశంపై రాష్ట్రస్థాయిలో నిర్వహించిన జిజ్ఞాస ప్రాజెక్టులో పాల్గొనడం అభినందనీయమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జాడి రవి కిరణ్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రాజెక్టు రూపకల్పనలో సహకరించిన గణిత అధ్యాపకురాలు శ్రావణి, ప్రాజెక్టులో పాల్గొన్న విద్యార్థులు పూజ, చంద్రకళ, నరేశ్, శేఖర్, అమృత్‌లకు సర్టిఫికెట్లు అందజేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రావణి, అధ్యాపకులు సంగీత, శ్రీరాధ దేవి, రాణి, రాజశేఖర్, రవీందర్, రాజ్ కుమార్, శ్రీనివాస్, జావిద్ పాల్గొన్నారు.

ట్యాబ్ అందజేత

ఉట్నూర్‌రూరల్: చదువులో రాణించి సమాజంలో గుర్తింపు సాధించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. గురువారం మండలంలోని హస్నాపూర్ గ్రామానికి చెందిన అంధ విద్యార్థి రాథోడ్ అనిల్‌కుమార్‌కు టాబ్లెట్ ఫోన్‌ను అందించి బాగా చదువుకొని ఉన్నతంగా రాణించాలని సూచించారు.

అల్లాడుతున్న మూగజీవాలు

- నిరుపయోగంగా నీటితొట్టీలు
- నిర్వహణను గాలికి వదిలేసిన అధికారులు
- ఉపయోగంలోకి తీసుకురావాలని పశుపోషకుల వేడుకోలు


తలమడుగులో ఎండిపోయిన వాగు


లింగిలో నిరుపయోగంగా నీటి తొట్టీ

తలమడుగు: వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు లక్షల రూపాయలు ఖర్చుపెట్టి గ్రామాలలో నీటి తొట్టీలు నిర్మించారు. వాటి నిర్వహణ సరిగా లేక నిరుపయోగంగా మారాయి. దీంతో మూగ జీవాలు నీటి కోసం అల్లాడుతున్నాయి. తలమడుగు మండలంలో మొత్తం 28 గ్రామపంచాయతీలు ఉన్నాయి. గతంలో జాతీయ ఉపాధి పథకంలో పశువులకు తాగునీరు అందించేందుకు అన్ని గ్రామాల్లో నీటి తొట్టీలను నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు వాటిని ఉపయోగించిన దాఖలు లేవు. దీంతో పశువులు తాగునీటి కోసం అల్లాడుతున్నాయి. ఐదు గ్రామాల్లో మాత్రం పశువులకు తాగునీటి ట్యాంకుల కింద భాగంలో నిర్మించారు. వాటిలో నీరు నింపడంతో పశువులు దాహార్తి తీర్చుకుంటున్నాయి. నీటి సౌకర్యం లేని చోట అలానే వదిలేశారు. కొనిచోట్ల శిథిలావస్థలకు చేరుకున్నాయి. మండల వ్యాప్తంగా మొత్తం పశువుల సంఖ్య 31250 ఉన్నాయి. అడవికి మేతకు వెళ్లి తాగునీటి కోసం అల్లాడుతున్నాయి. అయినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని పశుపోషకులు పట్టించుకోవడం లేదు. చిన్నచిన్న మరమ్మతులు చేస్తే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. వేసవిలో ఎండలు దంచికొట్టడడంతో వాగులు, చెరువులు, కాలువలు పూర్తిగా ఎండిపోయాయి. కొండ ప్రాంతాల్లోని కుంటలు అడుగంటిపోయాయి. తాగునీటి కోసం పశువులు గ్రామాల్లోకి వచ్చి నీటి కోసం అల్లాడుతున్నాయి. కొంత మంది రైతులు పశువుల దాహార్తి తీర్చేందుకు బోరు బావుల వద్ద నీటిని నిల్వ ఉంచి, పశువుల దాహార్తి తీర్చుతున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి నీటి తొట్టీలకు మరమ్మతులు చేయాలని పశుపోషకులు కోరుతున్నారు.

వాగులు ఎండిపోయాయి

గ్రామాల్లోని వాగులు, వంకలు, కుంటలు పూర్తిగా ఎండిపోయాయి. పశువులు తాగేందుకు నీరు లేక ఇబ్బంది పడుతున్నాయి. నీరు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి దాహం తీర్చుకుంటున్నాయి. కొన్ని గ్రామాల్లో ఉన్నటువంటి నీటి తొట్టీలకు మరమ్మతులు చేయాలి.

– కిషన్, రైతు

అధికారుల దృష్టికి తీసుకెళ్తా

నీటి తొట్టీలు నిరుపయోగంగా ఉన్న మాట వాస్తవమే. కొన్ని గ్రామాల్లో ఉపయోగిస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో నీటి సౌకర్యం లేక శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటికి మరమ్మతులు, ఉపయోగించేలా ఉన్నతాధికారులకు నివేదిక అందజేయడం జరుగుతుంది.

– శేఖర్, ఎంపీడీవో

గెలుపే లక్ష్యంగా పని చేయాలి


పార్టీలోకి ఆహ్వానిస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

ఎదులాపురం: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగణ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవాభవన్‌లో పట్టణంలోని 3వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ సాయి ప్రణయ్, ఆయన అనుచరులకు తిలక్‌నగర్, ఖానాపూర్‌లకు చెందిన శంకర్, అభుజర్, షేక్ ఫరీద్‌లు కంది శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కష్టపడి పని చేసేవారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. హామీ మేరకు వంద రోజుల్లోనే ఐదు గ్యారంటీలు అమలు చేసిందని, 29 వేల ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జైనథ్ జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్ రెడ్డి, మంచికట్ల ఆశమ్మ, శంకర్, బాయిన్‌వార్ గంగారెడ్డి, యాల్ల పోతారెడ్డి, సింగిరెడ్డి రామ్ రెడ్డి, కోరేటి కిషన్, ఖయ్యూం, బండి దేవిదాస్ చారి, సుధాకర్ గౌడ్, తమ్మల చందు, ఉదయ్ కిరణ్, మహిపాల్ రెడ్డి, మహేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో వేగం పెంచాలి


పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో భాస్కర్

ఇచ్చోడ: ఉపాధి పనుల్లో మరింత వేగం పెంచాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. గురువారం ఇచ్చోడ పంచాయతీ పరిధిలో చేపడుతున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున ఉదయం 7 గంటలకే పనులకు హాజరై 10 లోపు ముగించాలన్నారు. పకడ్బందీగా పనులు చేపట్టాలన్నారు.

ఉపాధి కూలీలకు ఇబ్బంది లేకుండా చూడాలి

ఇంద్రవెల్లి: ఉపాధి పనుల్లో కూలీలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఎంపీడీవో భాస్కర్ అన్నారు. గురువారం మండలంలోని పాకిడిగూడ, హీరాపూర్ గ్రామాల్లో సందర్శించి ఉపాధి పనులను పరిశీలించారు. వందశాతం కూలీలు ఉపాధి పనులు చేసేలా దృష్టి సారించాలన్నారు. ఎండలు ఎక్కువ ఉన్నందున ఉదయం పూటనే పనులు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో జాదవ్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్, శ్రీను, సిబ్బంది కనక భగ్వంత్‌రావ్, తొడసం మారుతి పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నైనత

జైనథ్: విద్యార్థులు వేసవిలో జాగ్రత్తలు పాటించాలని జైనథ్ పీహెచ్‌సీ వైద్యురాలు నైనత, గిమ్మ పీహెచ్‌సీ వైద్యురాలు సుచల అన్నారు. గురువారం వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. జైనథ్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో, గిమ్మ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గిమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సాల్ట్ పరీక్షలు నిర్వహించారు. నేషనల్ అయోడిన్ డెఫిషియన్సీ కంట్రోల్ ప్రోగ్రాం ఆధ్వర్యంలో వడదెబ్బ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అత్యవసరం అయితే తప్పా ఎండలకు బయటకు రావద్దన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో అంజయ్య, అనిత, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర


శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: రైతులు పండించిన పంటలకు కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి రాజేశ్వర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో పీఏసీఎస్, నాఫెడ్, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. దళారులకు పంట అమ్మకం ద్వారా తూకంలో మోసం జరుగుతుందన్నారు. అలాగే సరైన ధర రాక నష్టపోతారని అన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పీఏసీఎస్ సీఈవో ధరంసింగ్, సిబ్బంది తుమ్మల సునీల్, సురేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రా మంలో ఇటీవల పలువురు మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులను గురువారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరామర్శించారు. చిన్న కొమురయ్య, ఎరడ్ల రాములు, వంజరి శంకర్, మల్లెపూల వీరక్కలు అనా రోగ్య సమస్యలతో మరణించారు. విష యం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి నివాసాలకు వెళ్లి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వడూర్ ఎంపీటీసీ అంబేకర్ పండరి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లే నానక్‌సింగ్, మాజీ ఎంపీటీసీ ఉప్పు పోశెట్టి, సాబ్లే ప్రతాప్ సింగ్, ఆదుముల్ల రాములు ఉన్నారు.

జాదవ్ కృష్ణ నాయక్‌కు డాక్టరేట్

నేరడిగొండ: బంజారా జాతిముద్దు జాదవ్ కృష్ణ నాయక్‌కు డాక్టరేట్ లభించింది. గాడ్ సన్స్ హోలీ స్పిరిట్ అమెరికన్ టెక్సాస్ యూఎస్ఏ యూనివర్సిటీ చైర్మన్ డాక్టర్ ఎం.వరప్రసాద్, డాక్టర్ కె.మరియా కుమార్ రెవరెండ్, డాక్టర్ ఏఎస్ శ్రీనివాస్‌లు డాక్టరేట్ పట్టాను గురువారం అందజేశారు. మండలంలోని సవర్గాం గ్రామానికి చెందిన జాదవ్ కృష్ణ నాయక్ సమాజ సేవను గుర్తించి డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగిందని పేర్కొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

తలమడుగు: పశువులకు తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని పశువైద్యాధికారి దుద్‌రాం రాథోడ్ అన్నారు. గురువారం మండలంలోని కొత్తూరు, కప్పర్‌దేవి గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పశువులను ఉదయం పూట విడిచిపెట్టకుండా ఉంచుకోవాలని సిబ్బంది సూచించారు. ఈ అవకాశాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు 9 గ్రామ పంచాయతీలలో గాలికుంటు నివారణ టీకాలు వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రైతులు గంగారం, గోపాల మిత్రులు ఆశన్న, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రజలను అప్రమత్తం చేయాలి'

తాంసి: ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలకు అప్రమత్తం చేయాలని తాంసి వైద్యాధికారి శ్రావ్య వాణి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలకు ఎండల తీవ్రత దృష్ట్యా అవగాహన కల్పించారు. అనంతరం ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందజేశారు. టీబీ కిట్లను సైతం అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ తులసీరాం, వైద్య సిబ్బంది సంపత్ కుమారి, మేఘ, ఏఎన్ఎం సుజాత, కళావతి పాల్గొన్నారు.

పండుగను సామరస్యంగా జరుపుకోవాలి


ఇఫ్తార్ విందులో పాల్గొన్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: పండుగను సామరస్యంగా జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని గురువారం ఈద్గా మైదానంలో ఎంఐఎం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు నజీర్, మైనార్టీ నాయకులు సాజిద్ ఖాన్, ముస్లింలతో కలిసి ఉపవాస దీక్ష విరమించారు. శాంతియుత వాతావరణంలో పండగలను జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో ముస్లింలు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో తాగునీటి కటకట

- బాటిళ్లను కొనుగోలు చేస్తున్న రోగుల బంధువులు
- పట్టించుకోని అధికారులు


నిరుపయోగంగా వాటర్ ఫ్రిడ్జ్

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు మెరుగైన వైద్యం అందించేందుకు మండల కేంద్రంలో సీహెచ్‌సీ (30 పడకల ఆస్పత్రి)ని ఏర్పాటు చేశారు. దాదాపు రూ. 4 కోట్ల రూపాయలతో విశాలవంతమైన భవనాలను నిర్మించారు. అన్నిరకాల సదుపాయాలు ఉండేందుకు విభాగాల వారీగా గదులు, వార్డులను కేటాయించారు. కానీ డాక్టర్ పోస్టును మంజూరు చేయలేదు. ప్రస్తుతం దంతన్‌పల్లి పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబును డిప్యూటేషన్‌పై నియమించి వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రతీ రోజు ఆస్పత్రికి ఓపీ రోగులు 200 పైనే వస్తుంటారు. బుధవారం వారసంత రోజు 300 దాటుతుంది. వారానికి 5 నుంచి 10 లోపు కాన్పులు అవుతాయి. ఆస్పత్రిలో మంచినీటి సౌకర్యం లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. ప్రత్యేకంగా నీళ్ల ట్యాంకు నిర్మించలేదు. బోర్‌వెల్ లేదు. కాన్పు సమయంలో నీళ్ల కోసం రోగుల సహాయకులు పడరాని పాట్లు పడుతున్నారు. దుకాణాల నుంచి రూ. 20 చెల్లించి నీళ్ల బాటిల్ తెచ్చుకుంటున్నారు. దీంతో వారు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. రోజుకు నాలుగు నుంచి ఐదు బాటిళ్లు తెచ్చుకోవాల్సి వస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్, ఐటీడీఏ పీవోల దృష్టికి తీసుకెళ్లినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఆస్పత్రిలో మంచి నీటి సౌకర్యం కల్పించలేని ఐటీడీఏ ఉండి ఎందుకని గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సర్కారు దవాఖానలో మంచి నీటి సౌకర్యాన్ని కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. ఈవిషయమై సీహెచ్‌సీ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ జాదవ్ ఉపేందర్‌ను వివరణ కోరగా ఆస్పత్రిలో తాగునీటి సమస్య ఉన్న మాట వాస్తవం. కలెక్టర్‌తో పాటు ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. త్వరలో నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ఆత్రం సుగుణను గెలిపించాలి


మాట్లాడుతున్న ఆనంద్‌రావు

బేల: ఆదిలాబాద్ పార్లమెంట్‌కు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆదివాసీ కాంగ్రెస్ కమిటీ ఆదిలాబాద్ పార్లమెంట్ కోఆర్డినేటర్ సెడ్మకే ఆనంద్‌రావు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధిష్టానం ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా ఆడబిడ్డ ఆత్రం సుగుణకు టికెట్ ఇచ్చి గౌరవం ఇచ్చిందన్నారు. ఆమెను భారీ మెజార్టీతో గెలిపించి కాంగ్రెస్ అధిష్టానానికి బహుమతి ఇవ్వాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. సమావేశంలో బేల, జైనథ్ మండలాల బ్లాక్ అధ్యక్షుడు గుండవార్ సంజయ్, మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, వాంఖడే వామన్, గావుండే ఘణేశ్యాం, మడావి చంద్రకాంత్, గోడే అనివాష్ పాల్గొన్నారు.

జయంతి విజయవంతం చేయండి



మాట్లాడుతున్న మోతే బారిక్ రావ్

ఎదులాపురం: బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని విజయవంతం చేయాలని మాదిగ జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్ మోతే బారిక్ రావు కోరారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం మాట్లాడారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ చౌక్‌లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. భారత రాజ్యాంగం, కార్మిక చట్టాల అమలు, కార్మికుల సంక్షేమానికి బాబు జగ్జీవన్ రామ్ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నక్క రాందాస్, బాబు జగ్జీవన్ రామ్, మల్యాల మనోజ్, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆపిల్ తోట సందర్శన


ఆపిల్ తోటలో అధ్యాపకులు, విద్యార్థులు

బేల: మండల కేంద్రంలోని కీర్తన డిగ్రీ కళాశాలకు చెందిన డిగ్రీ వృక్షశాస్త్ర, చరిత్ర విభాగం విద్యార్థులు గురువారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని దనోరా గ్రామ శివారులోని ఆపిల్ తోటలు, జోడేఘాట్‌లో కుమురం భీం మ్యూజియంను సందర్శించారు. ఈ సందర్భంగా సీనియర్ వృక్షశాస్త్ర అధ్యాపకులు, ప్రిన్సిపాల్ వరప్రసాద్‌రావు మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశంలో ఆపిల్ పంటల సాగు చాలా అరుదని, ఇంకా అనేక పంటలు ఇక్కడ సాగు చేస్తున్నారని వివరించారు. భవిష్యత్ తరాలకు ఈసాగు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ ప్రిన్సిపాల్ గేడం ప్రవీణ్, సీనియర్ అధ్యాపకులు అమోల్, సంజీవ్, బిందు, సౌందర్య పాల్గొన్నారు.

9న రాంజీగోండ్ వర్ధంతి


నినాదాలు చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట రాంజీగోండ్ విగ్రహం వద్ద ఈనెల 9న క్రాంతివీర్ రాంజీగోండ్ 164వ వర్ధంతిని నిర్వహించడం జరుగుతుందని హీరాసుక జాగృతి సమితి జిల్లా అధ్యక్షుడు సిడాం రాంకిషన్ అన్నారు. గురువారం రాంజీగోండ్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీల హక్కుల కోసం రాంజీగోండ్ బ్రిటీష్ వారితో పోరాడి అమరుడయ్యాడని గుర్తు చేసుకున్నారు. అలాంటి మహనీయుడి వర్ధంతి, జయంతి వేడుకలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఆదివాసీలు, రాజకీయ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆదివాసీ పర్ధాన్ సమాజ్ నాయకులు మెస్రం శంకర్, మెస్రం గంగాదేవి, కుడ్మేత ప్రకాష్, మెస్రం నారాయణ, పెందోర్ రమేశ్, కినక గుండేరావ్, దుర్వ ప్రదీప్ పాల్గొన్నారు.